అక్కడ ఉండు. ఉద్యోగప్రయత్నం చెయ్యి! నీ ఖర్చులకి కావలసిన డబ్బు నేనిస్తాను-అప్పటికీ ఉద్యోగం దొరక్కపోతే-

శి: దొరక్కపోతే అనంతవిశ్వంలోకి వెళ్ళిపోతాను.

మా: వెర్రినాయనా. నువ్విప్పుడున్నది అనంత విశ్వంలోనేనోయ్!

సా: కాదు బాబయ్యగారూ ... ఆనందనిలయంలో! (అందరూ గొల్లుమని నవ్వుతారు.)

మా: సరేగాని బావా...మనలో మనమాట! నిజంచెప్పు. ఈ యింటికి నిజంగా ఎన్ని వేలయింది?

తం: నిజంగా చెప్పమంటావా?

మా: అందుకేగా అడుగుతున్నదీ.

తం: అయితే కొద్దిరోజులు ఓపిక పట్టు! కాశీలో విశ్వనాథుడి సమక్షంలో నిజం చెప్పేస్తాను!

(అందరూ గొల్లుమని నవ్వుతారు)

* * *

(రైలు నడుస్తున్న చప్పుడు. ఏమి జన్మంబేమి జీవనమూ... అనేపాట వినిపిస్తుంది.)

తం: ఏమిజన్మమేమిట్రా నీ తలకాయ్. సర్వోత్కృష్టమైన మానవ జన్మరా యిదీ.

మా: బావా ... కోట్లకి విలువైన మాట అన్నావోయ్!

(రైలు నడిచిపోతుంది)

(సమాప్తము)

---

కథానిక

# మనసులో ఒరవడి

టి. ఉషారాణి

కృష్ణ యింకా యింటికి రాలేదు. భవాని యింటి పనులన్నీ చేసుకుని, పిల్లలకు అన్నాలు పెట్టి నిద్రబుచ్చింది. తానుకూడా శుభ్రంగా తయారయి హాయిగా గాలికి అలసటతీర్చుకుంటూ కూర్చుంది. ఆ పిల్లగాలి, పైన ఆ చందమామ, చక్కటి ప్రశాంతమైన ఆ వాతావరణంలో మధురమైన భావాలతో చిన్నచిరునవ్వు పెదిమల మీద నాట్యంచేస్తోందా అన్నట్లుగా కూర్చుంది.

ప్రక్కయింటివాళ్ళ గడియారం గంటలు కొట్టడం మొదలెట్టింది. ఓపికతో ఎంచుతోంది భవాని. ఎంతసేపని? ఎనిమిది కొట్టి ఆగింది ఆ గడియారం. అబ్బ! అప్పుడే ఎనిమిదయిందా? యింకా వారింటికి రాలేదేంచెప్మా! అనే ఊహ ప్రవేశించిందా బుర్రలో...

తన రోజూ పనులన్నింటినీ పూర్తిచేసుకుని వంటపాటు అయ్యాక పిల్లలకు భోజనం పెట్టడం, ఏడుగంటలు కొట్టడం అలవాటే పిల్లలను నిద్రబుచ్చుతున్న సమయాల్లో మెల్లిగా వీధిలో తలుపుచప్పుడు అవడం, వారు రావడం అలవాటు. కాస్సేపు కబుర్లయ్యాక, ఇద్దరూ ఒకళ్ళకెదురుగ్గా ఒకళ్ళు...ఆహా...తనలా పెడితే వారొప్పుకోరు. మరీ గారాబం ఎక్కువవుతోంది ఈమధ్య. పట్టుదలలొకటి. వయస్సుతోబాటు యివీ ఎక్కువవ్వడం చాలా ఆశ్చర్యం అనిపించింది ఎన్నోసార్లు తనకు కాని ఏంలాభం? ఆగ్రహించాక, అనుగ్రహించమని కోరడం, సాగదీయించుకొని చిన్న నవ్వు తెప్పించి తాను అలసట తీర్చుకోవడం రోజూ పరిపాటి అయ్యాయి...పిల్లలతో పాటు వారికికూడా గారాబం, మారాం ఎక్కువయ్యాయి. సరే! ప్రక్కగా కూర్చుని తనకూడా భోజనం సాగించడం, మధ్యమధ్య వారి చిలిపి, కుర్రతనం ప్రవర్తన...అబ్బ...ఆ!...అప్పటికి ఎనిమిదిగంటలు కొట్టడం...

యివ్వాళ్ళ అసలు త్వరగానే రావల్సింది. ఎందుచేతోగాని టైం అంటే, అందులోనూ రాత్రంటే తనకు తగని భయం. అందులోనూ ఈ భయం చాలా ఎక్కువవ్వడానికి కారణం వారే!...

తనను కొత్తగా కాపరానికి తీసుకువచ్చిన రోజులవ్వి. మొదట ఉద్యోగంలో చేరగానే ఒక పల్లెటూర్లో వేశారు ముందు. ఆ చిన్నవూళ్

పీరు మాప్తారు. అందుచేత అంతా చుట్టూ మూగేవారు. తోచిందల్లా మాటాడుకునేవారు. స్వతహాగా మనిషి ఉబ్బిస్తే తనసంగతి మరచిపోతాడేమో! అల్లాగే వారు, అడిగిందే తడవుగా ఉన్నవీ లేనివీ కల్పించి చెబుతూ ఉండడం, వాళ్లు ఊంకొట్టడం యివి అలవాటయిపోయాయి. తను అంటూండేది. ఆ కబుర్లేవో మనయింటిదగ్గరే చెప్పుకుంటే బాగుండదా అని. కాని ఆ ఊరి పంచాయితీ గూడుపుఠాణీ ఆవరణలో జరగవలసిన 'పంచాయితీ'అంటూండేవారు. చీకటి అంటే తనకు భయం. అంచేత ఆ లాంతరు ముందెట్టుకు చిన్న చప్పుడు వినగానే బెదురుతూ వారొచ్చేదాకా...

అదుగో మళ్ళీ గడియారం గంటలు కొడుతోంది. తొమ్మిదీ! సరిగా గంట గడిచింది. కొద్ది కొద్దిగా సందడి తగ్గిపోతున్నట్లగుపిస్తోంది. ఎటు చూసినా, ఎవరినిచూసినా, వారిమాదిరన్నా తోచలేదు. ఆ వీధిలో లాగూ చొక్కా లేసుకునేవారు రే! అంచేత చెప్పగలుగుతోంది తన మనస్సులో ారింకా రావడం లేదని... వీధిలో కాస్సేపు ల్చుంది. ఆ రోజు ఏమిటో చాలా కష్ట డింది. యిల్లంతా సర్ది, శుభ్రంచేసి క్కడివక్కడ అన్నీ అమర్చి, యింటికి శోభ ర్చింది తను. ఆ సడలిన శక్తులవల్ల వచ్చిన డలికను అవలింతలు తోడుగా సూచనగా మెలి గాయి. మళ్ళీ ఒకసారి కళ్లు పెద్దవిచేసి సూక్ష్మంగా రిశీలించి చూసింది. ఎక్కడా అందుబాటులో గుపడలే ఆ ఆకారంగల వ్యక్తు లెవ్వరూ

మెల్లిగా లోపలికొచ్చి కుర్చీలో జార్లగిల డింది తలుపు దగ్గరగా వేసి. చల్లటిగాలి చక్కగా స్తోంది. దాంట్లో అనుక్షణంమార్పు రావడంతో నుమానంవేసి భవాని బయటికొచ్చింది. కొద్దిగా కటి ఎక్కువవుతోంది. చిక్కటి నల్లటిమబ్బు ందమామను వెన్నెలను వేరు చేసింది. మబ్బులన్నీ ముందుకు సాగిపోతున్నాయి. చల్లగాలిలో ల్లదనం మెల్లిగా ఎక్కువవుతోంది. వానపడే వకాశాలెక్కువగా అగుపిస్తున్నాయి.

వేగంగా లోపలికొచ్చి ఏమున్నా తడుస్తాయున్న అనుమాననివృత్తి చేసుకు లోపలికివచ్చింది వాని. తలుపు గడియవేసింది. కుర్చీలో కూర్చుంది. ప్రతీ అవయవానికి అధికమైనవిశ్రాంతి. మనస్సుమాత్రం మిసమిసలాడుతోందొకమూల.

వారింకా రాలేదు. ఎంచేతో...

తలుపులు ఒక్కమారు ఊగాయి. పరుగుతో వెళ్ళి తలుపుతీసింది. చల్లగా గాలి జోరుగా తన మీంచి పోయింది. వారు రాలేదు.

మళ్ళీవచ్చి కూర్చుంది.

చిటకట వాన ఆరంభమయింది. తనకు కునుకు పట్టింది...

వారొచ్చారు. తలుపు తట్టారు, తానుత్వరగా వెళ్ళి తలుపు తీసింది. లోపలికి రాగానే తాను తలుపే మళ్ళా వేసేసింది, గాలి చల్లదనం భరించలేక. తిరిగి చూసింది. తడిసిపోయి ఉన్నారు. ఆ గుడ్డలవల్ల, గాలివల్ల చిన్నగా వణుకుతున్నారు. వెంటనే మార్చుకోడానికి తాను పంచె, బనీను తెచ్చియిచ్చింది. అందుకున్నారు. అవి తీసేసి ఈ పొడిబట్టలు కట్టుకు వచ్చారు. కొద్దిగా వణుకుమాత్రం అల్లానే ఉంది. అప్పుడు తనకో పట్టరానంతగా నవ్వొస్తోంది. ఎంచేతనంటే తనకిప్పటికీ జ్ఞాపకం...ఓ రోజున తాను నోము నోచుకుంటోంది. వార్ని సరదాగా సెలవుపెట్టమని చెప్పింది. సరే అల్లాగేనని యింట్లో ఉండిపోయాడు. తను తలనిండా శుభ్రంగా స్నానం చేసి యింట్లోకి వస్తోంటే కట్టుకున్నబట్ట తడిమీదట, వేసేగాలి చల్లదనంవల్ల, తాను వల్లిస్తున్న "దేవీస్తోత్రం"లో మాటలు వణుకుతో వస్తున్నాయి. వారడిగారు ఏమిటి చదువుతున్నావని. "దే...వీయియిస్తోత్రంంం" అంటూ తను వణుకుతూ చెప్పింది. అదేపనిగా నవ్వారు. నన్ను నాస్థితిని, నా భక్తిని-చూసి గాబోలు...నాకది జ్ఞాపకం యింకా. వారింకా వణుకుతూనే కుర్చీలో కూర్చున్నారు. తను వారితల తువ్వాలుతో తుడుస్తోంది. తన చేతికి వెచ్చగా...వారి నుదురు తగిలింది. నుదురు వేడిగా ఉంది. వారికీ ఈ తడవడంవల్ల నాకు నవ్వుపోయి కంగారెక్కువయ్యింది. జాగ్రత్తగా చూసింది. వళ్ళు వేడిగా ఉంది...జ్వరంవచ్చినట్లుంది...

కంగారుగా లేచింది. తలుపుచప్పుడుతో మెళకువ వచ్చింది. తలుపు చాలా హడావుడి చేస్తోంది. వారొచ్చారా? వస్తే అల్లా తలుపు

ఊరికే లాగరు..పిలుస్తారే... ఈ గాలిదేవుడు గడుసువాడు. సమయంచూసి యిల్లా అల్లరి చేస్తున్నాడు. అల్లరి చేయిస్తున్నాడు. వారు వస్తారేమో!

ఒక్కసారి తలుపు బాగా అల్లరిచేసింది.

తలుపుతీసి బయలుకొచ్చి చూసింది. బాగా గాలివీస్తోంది. కొద్దిగా చినుకులు పడుతున్నాయి. మెరుపులెక్కువగా ఉన్నాయి. బాగా ఉరుముల సందడి ఎక్కువయ్యింది. ఆ మెరుపుల కాంతిలో వచ్చేపొయ్యేవారు స్పష్టంగా అగుపిస్తున్నారు. ఆశ తగ్గిపోతోంది. మనసు నీరసిస్తోంది. లోపలికి రాబుద్ధి పుట్టడంలేదు.

ఒకవేళ సినిమాకి వెళ్ళారేమో? వెళ్ళితే చెప్పకండా వెళ్ళరే! ఏమో ఏం చెప్పగలం! ఈ పట్నవాసంగాని, పల్లెటూరుగాని ఈ ఊళ్ళోకివచ్చాక వారు సినిమాల మోతాదు హెచ్చించారు. కాని తనతో వెళ్ళేవే ఎక్కువ. విడిగాపోయినా చెప్పి వెళ్తారు. ఎప్పుడూ అల్లా చేయరు.

మరి స్నేహితులెవరైనా! ఆ! ఎవరున్నారు. ఈ ఊరిరాకి వచ్చాక స్నేహాలు తగ్గిపోయాయి. ఉన్న ఆ ఒక్క ఉమాకాంతూ ఎప్పుడు వారిని యిక్కడే కలుసుకుంటూంటాడాయె. ఇంక అనుమానం దేనికీ!

పని ఏమీలేనట్లు మళ్ళీ గడియారం అల్లరి చేస్తోంది. ఈసారి దాని గంటలు ఒకటి, రెండూ గాదు పది. సరిగ్గా పదిగంటలు. అబ్బ! ఎంత టైంఅయ్యిందీ! కడుపులో ఆకలి కేకవేసినా ఏమీ తనకు తెలిసే తెలీటంలేదు, కారణం మనస్సులో కృష్ణమూర్తి మూర్తీభవించాడామె. ఇంక ఆకలి పోకడలకు అవకాశమేదీ!

మంచి వేగంతో ఒక కారు తన ముందునుంచి పరుగెత్తింది రోడ్డులోఉన్న గతుకుల్లో నిలవ నిస్తున్న నీళ్ళను చెదరగొడుతూ. ఒక్కసారి అసహ్యించుకుంది దాని నడక చూసి. మోటుగా ఏమిటీ యీ నడపడం కారునడిపే వాళ్ళకు కళ్ళు ఉండవల్లేఉంది వెధవలు, మొన్న ఓ బస్సువాడు చూడకుండా నడుపుతూంటే నేగా ఆ ప్రక్క ఓ కుక్కపిల్ల కెవ్వోమంది. వీళ్ళు నోరులేని జంతువులనే లక్ష్యపెట్టకపోతే...

కళ్ళు చెదిరాయి తనకు ఏదోపిచ్చి ఆలోచన తన మనస్సు కలవరపరచింది. వెధవ కార్లు ఈ ఊళ్ళో తామెందుకు వచ్చామా అనుకుంది. స్వామిమేలుచేసి అటువంటిది జరగగూడదేపో... జరుగు...ఛా! వెధవ మనస్సు. దీనికి బుద్ధంటూ లేదు... అని తిట్టుకున్నా అది పనిచేయడం మానదు. మనస్సునకుని లాభమేమిటి? తను ధైర్యంగా ఉండాలిగాని...కాని ధైర్యంగా ఎల్లా ఉండగలరెవరైనా ఈ పరిస్థితిలో యింత కంటూ నిబ్బరంగా...

దూరాన్న ఎవరో వస్తున్నారు. వారల్లే ఉంది. లాగులోకి చొక్కా దోపుకున్నారు ఆ నడక...అల్లానే ఉంటుందిలే...ఒక్కొక్క సారి తన్నేడిపించడానికని వారల్లా నడిచి ఇంకో గొంతుతో పిలిచి...తనకి పెద్ద తెలీకనా కావాలని ఆశ్చర్యపడ్డట్టు నటించేది. అల్లా చేస్తే ఆయన సంతోషిస్తారని తనకు తెలుసు. అది నిజమే అంత మెల్లిగా నడుస్తున్నారేం? ... అలసిపోయుంటారు. తిరిగినమీదట. పైగా భోజనం చేయ లేదుగా ... కడుపు గొడవ చేస్తోందిగాబోలు పాపం...అదేమిటి జుట్టంతా రేగి అల్లాఉండేం ఆ! ఏముందీ! యిందాకటినుంచి ఈ గాలిలో ఎంత బాగాదువ్విన జుట్టయినా రేగి తీరుతుంది ఇంట్లోఉన్న తన స్థితిచూడరాదూ...నవ్వుకుం మెరుపు మెరిసింది. నల్లగాఉన్నట్లుంది ఆ వ్యక్తి నల్లగాఉన్నారేం చెప్మా! ... అలసినమీదట చెమటుపోసి పాకం అల్లా ఉన్నారేమో! .. చెమటుపోస్తే నల్లగా ఉంటారేమిటి ... ఆ ఎంచక్క ఉంటారు...దగ్గరి కొచ్చేస్తున్నారు.. వచ్చేశారు...వెళ్ళిపోయాడు. దాటిపోయాడు కాని వెళ్తున్నంతసేపూ తనవంకే తేరిపా చూశాడు. ఎందుకో...తను వీధిలోనుంచున్నా ననా? వాడికేం నుంచుంటే?...లోకం.

అలసిపోయింది భవాని. ఆదుర్దా ఎక్కువయ్యింది. దానితోపాటు భయం. అన్నిటి మి చిర ఆవేదన. చూసిచూసి మెడనెప్పి పెట్టింది ఆటుయిటు తల త్రిప్పింది. అప్పుడే అటుపోయి వాడు తిరిగివస్తున్నాడు. మెరుపులో చూసింది వాడి దృష్టులన్నీ...తనవైపే!...ఛీ... ఈసా

వాడుకొద్దిగా అటూయిటూ ఊగుతున్నట్లు తనకళ్ళకు కనిపించింది. గుండెలు గబగబ కొట్టుకున్నాయి. లోపలికి పరిగెత్తి తలుపు మూసి నుంచుంది అడ్డుగా దానిమీద చేరగిలబడి. గుండెల్లో గోలగా ఉంది...అల్లరిగా ఉంది. తిరిగి, తలుపు గడియపెడదామంటే చేతుల్లో ఓపిక లేదు తిరగడానికి సత్తువ లేదు. కదలకుండా అల్లాఉండిపోయింది. మనిషి కదలలేదు. మరి మనసో...

ఈమధ్య చాలాసార్లు వారంటూవచ్చారు; 'దొంగతనాలు ఊళ్ళో కాస్త ఉన్నట్టనుకుంటున్నారు. జాగ్రత'అని. తనప్పటినుంచి జాగ్రత్తగానే ఉంటోంది. పైగా వారుంటే తనకేం, గుండెల్లో ధైర్యం ఎంతగానో ఉంటుంది. అప్పుడు తనని ఎవ్వరూ ఏంచేయలేరు. అది అలా ఉంచి యిప్పుడో...ఆ! ఇందాకటివాడు దొంగ కాడుగదా...

ఆ ఆలోచన రాగానే భవాని వణికిపోయింది. గొంతు తడి ఆరిపోయింది. తడి చేసుకుందామంటే, నీళ్లుతాగుదామంటే వెళ్ళాలి. వెళ్ళి తాగాలి. ఓపికేదీ! అయినా తను తలుపు గడియ వేయకుండా ఉంటే ఈపనేలా చేయగలదు? వెళ్ళాలి, నీళ్ళుముంచుకుని...తాగాలి.

వీధిలో ఏదో చప్పుడయినట్లయింది. మనిషి నవనాడులూ బిగించుకు నిల్చుంది. తలుపు గడియ వేయలేదు. తలుపుగొడితే....తను తలుపుతీస్తుందా? ఎవరు అని అడుగుతుందా? మాటవచ్చేట్టులేదు. మాటాడకుండా ఉండిపోతుంది. ఎంత సేపని?...

చిన్నాడు లేచాడు ఏడుస్తూ. ఎందుకో ఏమో! వాడు సాధారణంగా ఏడవడు. ఏమైనా పుట్టిందో ఏమో! కంగారుతో పరుగెత్తింది భవాని చిన్నాడి మంచం దగ్గరికి. ఎత్తుకుంది. ఏమమ్మా అంటూండేటప్పటికే వాడుభుజంమీద వాలాడు నిద్రకోసమై. తల్లి వళ్ళో చేరాలనేమో వాడి యేడుపు. అయినా అనుమానంతో చుట్టూ చూసి, 'చిన్నా'అనిపిలుస్తూ తలుపువైపు తిరిగింది.

తలుపులు తెరుచున్నాయి. లోపలికి ఎవరో వస్తున్నారు. కళ్లు చీకట్లు కమ్మాయి భవానికి. ఏదో ఆకారంలా అగుపించింది. కొంపతీసి యిందాకటి వాడేమో. గుండెలవేగం ఎంతో.. హడలిపోయింది. అరుద్దామని గట్టిగా కేకేసింది. అది పైకిరాలా! కళ్ళునలిపి చూడాలనుకుంది. చూసింది. ఆ వ్యక్తి తనవైపే వచ్చాడు.

"ఏమండీ!" అంటూ అతనివైపు వాలిపోయింది భవాని.

"ఏం! చిన్నాడు లేచాడా?"అంటూ అతను భవానిని దగ్గరకు తిసుకున్నాడు. భవాని వణుకుతూంటే చూశాడు. కంగారు పడ్డాడు.

"ఏం! అలాఉన్నావ్!" అన్నాడు

"......"ఏదో అనబోయింది భవాని.

"చెప్పూ...ఊఁ" అంటూ గడ్డంపట్టుకు ముఖం పైకెత్తాడు. 'ఊఁ చెప్పవూ' అన్నట్లు చూస్తున్నాడతను.

"ఇంకెప్పుడూ ఆలస్యంగా రాకండేం''అందామనుకుంది. అనేసింది. కళ్ళల్లో నీళ్లుతిరిగాయి గిరుక్కున.

"ఊహుఁ!"అంటూ అతను ఆమెను దగ్గరికి తీసుకున్నాడు.

"నిజంగా నామీద ఒట్టే" అంది ఆమె.

"పిచ్చిదానా అల్లాగే"

భవాని కృష్ణమూర్తి ఒడిలో సడలి పోయి పాపయింది.

---

సాటిలేనిది స్వాతంత్ర్యం: "ఏకపక్ష నియంతృత్వప్రభుత్వం అమలు జరుగుతున్న దేశం ఎంతగా ఘనంగా వున్నప్పటికీ, ఎంత సిరిసంపదలతో తులతూగుతున్నప్పటికీ, ఎన్ని అవకాశాలున్నప్పటికీ వాటివల్ల ఒనగూడతగ్గ ప్రయోజనం స్వాతంత్ర దేశాలలో ప్రతి పౌరునికివున్న హక్కులతో ఎంతమాత్రం సాటిరాదు."

—(మాజీ సోవియెట్ గూఢచారి రాస్ట్వొరోవ్.)